# నా బండీ!

## శ్రీ ఆకుండి నారాయణమూర్తి

విచిత్ర మేమిటో అంటే, పరిగెత్తడం మానేసి ఈ మధ్య క్రొత్తగా నడవడం నేర్చుకుంది నా గుఱ్ఱం!-పైగా వెనక్కు కూడా నడుస్తున్నాది!!...

అందుకు కారణం నాకుబాగా తెలుసు. మానసికంగానూ, శారీరకంగానూ నాలో ఈ మధ్య ఏర్పడుతున్న అనువులను బాగా అర్థం చేసుకుంటున్నాది నా గుఱ్ఱం!- అందుకే దానికంత పొగరెచ్చయింది-

నా గుఱ్ఱాన్ని మళ్లీ సవ్యమయిన మార్గం లోకి తీసుకు రావడమెలా అనే సమస్య నన్ను కొన్నాళ్లయి చాలా బాధిస్తున్నాది. ఇక నా గుఱ్ఱం నాకు లొంగదని బాగా తెలుసు. కమ్చీ పట్టుకుందికి చేతిలో చేవుంటేగా!...

సరే, నాగుఱ్ఱం ఎలా మారుతే నేం?! ...నా బండీ చక్రాలరిగి పోలేదు. ఇంకా క్రొత్తగానే ఉన్నాయి! ...అంచేతరండి-నా బండీ ఎక్కండి!- మిమ్మల్ని నాతోపాటు తీసుకుపోతా!!-

మీరు బయలు దేరక పోతే ఈ ద్భుకు పోతా!-ఇకరండి!-...ముఖ్యంగా వాడిపోయిన పువ్వులవలే ఉన్న, నాలాంటి రచయితలంతా నాతో బయలు దేరండి. మనం అంతా జట్టు!-మనమంతా ఓ ముఠా!-... మరో ప్రపంచపు టంచుల్ని చూద్దాం!... ఇంకా అలా చూస్తున్నారేం?-ఎక్కండి.

మీ రెవరూ జట్కా తోలలేరు. మీకు నా గుఱ్ఱం వినదు!-ఇంతకీ మీకు తోలడం వచ్చునా?- ఊహూ!-మీ సంగతి నాకు బాగా తెలుసు. జట్కా తోలుకొని జీవించే అంతటి నిర్భాగ్యులు మీరు కారని నాకు తెలుసు-కానీ-మీకు నిజంగా నా మీద అభిమానమే ఉన్నట్లయితే, బండీ తోలడం నేర్చుకుని నన్ను కాపాడండి. కొద్ది రోజుల్లో కళ్లేం పట్టుకొనే అందుకు వీలు లేని స్థితిలోకి వస్తున్నాను!-అంచేత మార్గం చూపిస్తాను, నా యందు దయ ఉంచి కళ్లేం పట్టుకొని నా సలహాలు పాటిస్తూ నా జీవిత రథాన్ని నడుపడానికి ఎవరయినా వచ్చి, పుణ్యం కట్టుకోండి.

* * *

## 2

పాపం, ఆ అమ్మాయి గురించి తల్చుకుంటే నాకెంతేనా జాలివేస్తుంది!-నిన్న నందిన ఉత్తరంతో అప్పుడే నాలుగుత్తరాలామె దగ్గరనుంచి వచ్చేయి!...పాపం, ఆమె ఊరికనే ఆయాస పడుతున్నాది. నా యథార్థ జీవితం తెలిసినట్లే అయితే ఆమింతగా ఆయాస పడక అనవసర ఆశలతో ఆత్రత పడక పోయేదేమో అని నా తలంపు!- నేనో రచయితనన్న విషయమే ఆమెకు తెలుసును గానీ, తదితర వ్యక్తి గతమయిన నా జీవిత విశేషాలేవీ ఆమెకు తెలియవన్న సంగతి ఆమె నాకు వ్రాసిన లేఖలు బుజావు చేస్తున్నాయి!-ఆమె మొదటిమారు వ్రాసిన ఉత్తరం చదువుతూ ఉంటే కొన్ని చోట్ల కడుపు చెక్కలయేలా నవ్వు వచ్చింది!- "మీ యడ్రసు కనుక్కొందికి చాలా శ్రమ పడ్డాను. ఆఖరికి ఓ ఎడిటర్ ధర్మమా అంటూ మీ యడ్రసు ఇచ్చేడు!...... క్రిందటి వారం పత్రికలో ప్రచురింప బడ్డ మీ కథలో కాలేజీ జీవితాన్ని చక్కగా చిత్రించేరు!-ఇప్పుడు మీరింకా కాలేజీ జీవితాన్నే గడుపుతున్నారని ఆశించవచ్చా?!...కానీ మీ యడ్రసు కొంత మీమాంసను కలిగిస్తున్నాది. 'కేరాఫ్ డిప్యూటీ తాసిల్దారు' అని వుంది. ఆయన మీ తండ్రిగారే అనుకుంటాను..." పైరకం ధోరణిలోనే నాకెంతో నవ్వు వచ్చేవిధంలో రాసిందా అమ్మాయి.

పాపం, ఆమెకేం తెలుసు నా యథార్థ పరిస్థితి!.... ఇన్నాళ్ళవరకూ తాసీల్దారు గారింట జట్కాతోలే బండివాడిగా ఉంటున్నానని ఆమెకేం తెలుసు?—

—నా జీవన రథానికి సారథ్యం చేయడానికి ఇప్పుడెవరొప్పుకుంటారు?— ఇక ఇప్పుడు ఆ అమ్మాయి దగ్గరనుంచి మరి లేఖ రాదని నాకు బాగా తెలుసు!... ఇక నా ఈ యథార్థ జీవితాన్ని బయట పెట్టేసిన తరువాత మరి నన్నామె తల్చుకోదనికూడా తెలుసు!...

—ఇక మీ పాఠకులలో ధైర్యం గల వాళ్లుంటే ముందుకు రండి! నా బండీ నెక్కండి. నా ఈ చీకటి జీవితపు అగాధాలను చూపిస్తా!—భయపడకండి.

—నేను మా నాన్నను ఎరగను!—మా నాన్న చనిపోయిన రెండు నెలలకు నేనీ పాడులోకంలో మా అమ్మకి మరింత దుఃఖం కల్గించడంకోసం జన్మించేను. ప్రతీ తల్లీ ఆశించే విధంగానే నా తల్లి కూడా నా గురించి ఎన్నో ఆశలు కల్పించుకుంది. కానీ, తను చేస్తున్న దాసీ పనికన్నా పెద్ద పనిని నా కిప్పించలేక పోయింది!—ఓ తాసీల్దారు గారి అబ్బాయిని ఎత్తుకొని ఆడించడం నా మొదటి ఉద్యోగం!—ఏదో వారబ్బాయి ప్రయివేటు చదువుతూ ఉన్నప్పుడు నేనూ ఆ ప్రక్కనే ఉండి నేర్చుకున్న అక్షరం ముక్కలే ఇప్పటి నా ఈ విజ్ఞానం. నా మాతృభాషలో నాకు పెద్ద ప్రావీణ్యత ఉన్నాదని చెప్పను కానీ, నాలో ఉన్న భావాలను కాయితంమీద రాయగలను. అంతే!...

—నాగురించి మా అమ్మ ఆట్టే కాలం బాధపడ వలసిన అవసరం లేకపోయింది. మాతృత్వపు పాల పొంగులతో కని పెంచిన

(19-వ పేజీ చూడండి)


### నపుంసకతైలం

అంగ, నరములు బలహీనత చెంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/ వి. పి. రూ 1-0-0.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్

మలకపేట బిల్డింగ్స్,

హైద్రాబాద్, దక్కన్.



### నారసింహ లేహ్యము



బంగారు చేర్చబడినది. మేహము, నికార్క, నిస్సత్తువ శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

# నా బండి!

(10-వ పేజీ తరువాయి)

నా తల్లిబాధలు భగవంతుని హృదయం లోకి దూరేయి!... జాలితో లాలించి ఆమెకు శాశ్వత నిద్రను ప్రసాదించే డా కరుణా మయుడు!—ఇప్పుడు నే నేడుస్తుం న్నానో నవ్వుతున్నానో మీకు తెలీదు. నాకళ్ళల్లో నీళ్లా నాడే అయిపోయేయి!...

నా ఈ దీనావస్థ తాసీల్దారుగారి హృదయాన్ని దూసుకుపోయింది. నామీ దాయ నకు జాలికలిగింది. వారింటి పనిచేస్తూ శాశ్వతంగా నన్ను వారింట్లో నే ఉండ మన్నారు! వారింట్లో ఉంటూనే క్రమంగా జట్కా తోలడం నేర్చుకున్నాను. నా జీవితంలో నే చేసిన రెండో ఉద్యోగం అదే!.. అదిలో అమాంతంగా ప్రకృతి దేవతను దూసుకొని పోయి, సహజ లక్షణాన్ని విడిచి పెట్టకుండా 'అతి సాఫీగా పోయేది నాబండీ!... ఇప్పుడు మోజు తగ్గుతున్నాది కానీ, మొదట్లో చాలా మోజుండేది నాబండీమీద లోకులకి!...

ఇంతకీ, మీరు నాబండీని ఎప్పుడూ చూడలేదని కదూ అనుకుంటున్నారు!... చూసేరు!...చాలాసార్లు చూచుంటారు!!.. చాలాచోట్ల చూచుంటారు. ప్రస్తుతం మీరు నా బండీలోనే వున్నారు. గాబరా పడకండి! నాబండీ అంటే ఏమిటో తెలుస్తే మీకా గాబరా ఉండదు—

ఇప్పుడు నా ఈరథం మందగమనంలో ఉంది. అందుకు బాధ్యుడను నేను కాదు. నాకు సంప్రాప్తమయిన ఈజబ్బే అందుకు కారణం! ఈజబ్బే తాసీల్దారుగారికి కూడా నా మీద అసహ్యం గలిగినట్లు చేసింది. ఈ జబ్బే నా బండీకి అడ్డుగా తాటకిలా నిలబడి నాట్యం చేస్తున్నాది!-

ఈ జబ్బు నాకు తగ్గుతుందనే ఆశ మరి లేదు. నా హృదయానికి నిరాశ అనే బూజు పట్టుకుంది. ఈ బూజుని మీరు కొడుకదా నేను కూడా దులపలేను!-

కానీ చిన్న ఆశ మాత్రం మిగిలి ఉంది. ఎవరయినా పుణ్యాత్ములు, కల్లెంకంమిచ్చి, పట్టుకొని నా బండీని నడపగలరేమోనని!..

'నీకేం సంకటం?' అని మీరడగవచ్చు. నా చేతి వ్రేళ్లు ఇప్పటికి సగం మొండేలయి పోయేయి!..ఇక కొద్దిరోజుల్లో నాచేతులు మరెందుకూ పనికి రావు!...ఈ పాడు ముండా జబ్బు లక్షణం అది!...నన్నేం చెయ్యమంటారు?-నా ప్రార్థనేమిటే అంటే నా బండిలో కూర్చొని, నా సలహాలు పాటిస్తూ మరి కొంత కాలం పాటయినా నా బండీ తోలమని!...నా చేతికే వ్రేళ్లున్నట్లయితే మిమ్మల్ని ఎవర్నీ ఇంతలా బ్రతిమాలను!...ఇక కొద్దిరోజుల్లో ఈ ఉనతి పాటి వేళ్లూ మొండిగా తయారవుతాయి!.. అప్పుడు నా బండీకి మరి చక్రాలుండవు!!

నాకు ఇప్పటికి నాలుగుత్తరాలు వ్రాసిన ఆ అమ్మాయి, ఈ మొండి చేతులతో శ్రమపడి నేనెలానో రాసిన ఈ రచన చదవంగానే నాకుత్తరం మరి రాస్తుందో వ్రాయదో చూడాలి!-బహుశా ఆమె ఏ క్షయరోగో అయితే, పెద్దరోగంతో ఉన్న నాకర్ధాంగియగుటకు ఒప్పుకొని నా బండీని కొంత కాలం పాటయినా తోలడానికి పనికొస్తుందేమోనని నా ఆశ!...

సరే, ఇక బండీ దిగండి!... నా మొండి వ్రేళ్లంట రసి కారుతున్నాది!-ఈ కంపు మీరు భరించలేరు. నిరాశా పూరితమయిన దీకంపు. మానవుడు ఆశాజీవి అని కదూ మీ వాదం. కానీ నాకు మరి ఆశ లేదు. ఒకే ఆశ!!...ఎవరయినా నన్ను ప్రేమించి నా బండీ తోలడానికి సమ్మతిస్తారా??!.. అందుకు సమ్మతించినవాళ్లు నాకు లేఖ వ్రాయండి.

★


## మరియొక క్రొత్త మోడల్

68B-6 వాల్వ్యులు
డ్రైబ్యాటరీ రేడియో




"హింద్" డ్రైబ్యాటరీ రేడియో

(1) 8 అంగుళముల స్పీకరు (2) బాగా పాలిష్‌చేసిన కాబినెట్. (3) ఎక్‌స్ట్రా స్పీకర్ పికప్
(4) డైల్ లాంప్ (5) ప్రపంచములోని అన్ని స్టేషన్లనుండి వినవచ్చును. (6) డ్రై బ్యాటరీ రేడియో లన్నిటికంటె మంచిది.

## ఆంధ్ర ఎలక్ట్రికల్ హౌస్ లిమిటెడ్, ఏలూరు.

మద్రాసు ప్రెసిడెన్సీకి (స్టేట్సుతోసహా) డిస్ట్రిబ్యూటర్లు